
సాక్షి నంద్యాల

సోమవారం : 26, మే 2025



కృష్ణయ్యకు 'మధుర' నివేదన

కర్నూలులోని జగన్నాథ మందిరంలో ఆదివారం మామిడి పండ్ల ఉత్సవం నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. 8లో▸



.. డిస్మిస్‌కు రంగం సిద్ధం!

తిరుమలలో పోలీసులే మద్యం మత్తులో హంగామా చేసిన ఘటనను ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. ఆ ముగ్గురిని డిస్మిస్ చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,589.65
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 10.801
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,178
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,995

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా పల్లకీ సేవ



శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

కొండ నిండా భక్తులు



క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. పలువురు భక్తులు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ప్రత్యేక సమయాల్లో స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov. in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు తమ అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు.

పచ్చ నేతల నల్ల మట్టి వ్యాపారం!



ట్రాక్టర్‌లో నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

పగిద్యాల: టీడీపీ నాయకులు నల్లమట్టి వ్యాపారానికి తెరలేపారు. ఈనెల 14న పాతూరు తిప్ప నుంచి గ్రావెల్ బింగను అక్రమంగా తరలిస్తున్న వైనాన్ని 'పాతూరు తిప్ప కరిగిపోతోంది' అనే శీర్షికన సాక్షి దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై తహసీల్దార్ శివరాముడు స్పందించారు. అనుమతి లేకుండా గ్రావెల్, నల్లమట్టి తరలించరాదని ఆదేశాలు ఇచ్చారు. భూగర్భ శాఖ(మైనింగ్) అధికారులకు అర్జీ పెట్టుకోవాలని చెప్పారు. అయితే తహసీల్దార్ ఆదేశాలను పట్టించుకోకుండా టీడీపీ నాయకుడైన ఎంపీటీసీ సభ్యుడి కనుసన్నల్లో నల్లమట్టి వ్యాపారం సాగుతోంది. కృష్ణానది నీటి మునక భూముల్లో లభ్యమయ్యే నల్లమట్టిని చాలా లోతుకు తవ్వి ఒక ట్రిప్పును అవసరమైన రైతుల పొలాలకు రూ.1,100ల ప్రకారం అమ్ముతున్నారు.

శ్రీశైలంలో 39.5 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 39.4936 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 818.20 అడుగులకు చేరుకుంది. శనివారం నుంచి ఆదివారం వరకు ఎగువ సుంకేసుల ప్రాజెక్ట్, లోకల్ క్యాచ్‌మెంట్ నుంచి 8,942 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. జలాశయం నుంచి భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పాదన అనంతరం 7,259 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు. బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 800 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టారు. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 3.366 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 2 మీమీ వర్షం కురిసింది.

బతుకు బండి భారమాయె!

- ఎండీయూ వాహనాలను నిలిపి వేస్తూ ప్రభుత్వ నిర్ణయం
- పాలకుల తీరుతో జిల్లాలో రోడ్డున పడిన 351 ఎండీయూ ఆపరేటర్లు
- కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన వైనం
- ఎన్‌ఓసీ వచ్చే వరకు న్యాయపోరాటానికి సిద్ధం

కూటమి ప్రభుత్వ పాలకుల మాటలకు.. చేతలకు పొంతన ఉండటం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా చిన్న చిన్న ఉద్యోగాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న వారి పొట్టకొట్టి పాపం మూటగట్టుకుంటున్నారు. ఇప్పటికే వేల మంది వలంటీర్లను, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బందిని తొలగించగా.. తాజాగా రేషన్ వాహనాలు రద్దు చేసి ఎండీయూ ఆపరేటర్ల జీవితాలను రోడ్డున పడేశారు.



ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ప్రజలకు మెరుగైన పాలన అందించి, ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుతానన్నా కూటమి ప్రభుత్వం తిరోగమనం వైపు అడుగులు వేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాదరణ పొందిన సేవలను నిర్వీర్యం చేస్తూ అటు ప్రజలను, ఇటు ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తోంది. ఇటీవల రాష్ట్రస్థాయి ఎండీయూ ఆపరేటర్లతో జరిగిన చర్చల్లో సంబంధిత మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండీయూ వాహనాలను 2027 వరకు రద్దు చేయమన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అయితే నాలుగు రోజుల్లో రేషన్ బండ్లు ఆపేస్తూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడంతో వాహన యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే అద్భుత వ్యవస్థ ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్) వాహనాలను రాష్ట ప్రభుత్వం రద్దు చేయడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రేషన్ మాఫియా దందాకు అధిక శాతం కూటమి నేతలే నాయకత్వం వహిస్తున్న సంగతి తెలిసి కూడా నిందలన్నీ ఎండీయూ వాహనదారులపై వేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పుణ్యమా అని పేదలకు చౌక దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకునే కష్టాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. 2019 ముందు రోజులు తిరిగి మళ్లీ రానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,204 రేషన్ షాపులు, 5.41లక్షల రేషన్ కార్డులకు 7,600 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతుంది.

రోడ్డున పడనున్న ఆపరేటర్లు...

72 నెలల అగ్రిమెంట్ కాలంతో విధుల్లో చేరిన ఎండీయూ ఆపరేటర్లకు ఇంకా ఒకటిన్నర సంవత్సరం ఉంది. 2027 జనవరి వరకూ అగ్రిమెంట్ ఉన్నా ప్రభుత్వం తొలగించడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 351 మంది ఎండీయూ ఆపరేటర్లు రోడ్డున పడ్డారు. ప్రజల ఇంటి వద్దకే రేషన్ సరుకులు చేరవేస్తున్నందుకు గానూ ప్రభుత్వం నెలకు రూ.18వేల జీతం అందిస్తుండగా అందులో పెట్రోల్ రూ.4 వేలు, హెల్పర్‌కు రూ.5 వేలు ఖర్చవుతుండగా వారికి రూ.9 వేలు మిగిలేవి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారంతా జీవనోపాధి కోల్పోవాల్సి వస్తోంది. ఈ పనినే నమ్ముకుని ఐదేళ్లుగా జీవనం సాగిస్తున్న ఆపరేటర్లు కూటమి ప్రభుత్వ నిర్ణయంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఒకటిన్నర సంవత్సరం అగ్రిమెంట్ సమయం ఉన్నా తొలగించడం అన్యాయమంటున్నారు. బ్యాంకుల్లో వాహనాలకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు అందజేసిన తర్వాతే డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

చౌక దుకాణాల వద్ద ఇక పడిగాపులే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీని తీసుకొచ్చింది. ప్రతి ఎండీయూ వాహనం ద్వారా వెయ్యి నుంచి 2 వేల కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీ వరకూ వాహనాలు ఇంటింటికీ తిరిగి రేషన్ అందిస్తూ వచ్చాయి. ఇంటి వద్దే బియ్యం పంపిణీ చేసే వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మంగళం పలికింది. దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న దీనిని నిలిపి వేస్తూ జిల్లాలో లక్షలాది మంది ప్రజలను కష్టాలకు గురి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. 2019కి ముందు రేషన్ షాపుల వద్ద నుంచి సరుకులు తెచ్చుకోవడం లబ్ధిదారులకు ప్రహసనంగా ఉండే ది. దుకాణాల్లో 50 నుంచి 60 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే సరుకులు తీసుకునే వారు. అక్రమాలు ఎక్కువగా జరిగేవి. ఎండీయూ ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయడం ద్వారా 95 శాతం మంది కార్డుదారులకు సరుకులు తేలిగ్గా లభించాయి. కూటమి ప్రభుత్వం వీటికి మంగళం పలుకుతుండటంతో ప్రజలు అవస్థ పడాల్సిందే. వాహనాలు తొలగించడంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు కష్టాలు పునరావృతం కానున్నాయి.

న్యాయపోరాటానికి సిద్ధం



అగ్రిమెంట్ కాలం ఉండగానే మమ్మల్ని తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయం. మా వాహనాలకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడాలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి ఎన్‌ఓసీ ఇప్పించాలి. మాకు న్యాయం చేయకుండా జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం సరఫరా చేస్తే ప్రభుత్వంతో న్యాయ పోరాటానికి సిద్ధమవుతాం. **– ఖాజా శ్రీనివాసులు, ఎండీయూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నంద్యాల**

ఉపాధి కోల్పోయాం



వచ్చే కొద్దిపాటి జీతంతో కుటుంబాన్ని పోషించుకునే వీలుండేది. గత నాలుగేళ్లుగా ఎండీయూ వాహనంపై ఆధారపడి జీవిస్తున్నాను. ఒక్కసారిగా ఎండీయూ వాహనాలను తొలగిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడం అన్యాయం. ఉపాధి కోల్పోతున్న ఆపరేటర్లకు న్యాయం చేయకపోతే ఆందోళనలకు సిద్ధమవుతాం. **– రమణ, ఎండీయూ ఆపరేటర్, నంద్యాల**

కరోనాలో ప్రాణాలకు సైతం తెగించి..



కరోనా సమయంలో ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు (ఫైల్)

కరోనా కష్టకాలంలో ప్రాణాలకు సైతం తెగించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇంటింటికీ రేషన్ డెలివరీ చేశారు. కరోనాకు భయపడి ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రాలేని పరిస్థితుల్లో రేషన్ బండ్లు ఇంటి ముంగిటకు చేర్చి నిత్యావసరులు అందజేశారు. అలాగే కూటమి ప్రభుత్వంలో కూడా కృష్ణా జిల్లాలో వచ్చిన వరద బాధితులకు వరద నిధికి తమ జీతంలో 10 శాతం మొత్తం విరాళంగా ప్రకటించారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి పర్యటన సందర్భంగా 100 ఎండీయూ వాహనాల ద్వారా ఆహార పంపిణీ చేయించారు. అంగన్‌వాడీ, ఐసీడీఎస్‌లకు బియ్యం సరఫరా కార్యక్రమం కూడా వీళ్లే అదనంగా చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన మూడేళ్ల బకాయిలు ఇంత వరకు రాకపోవడం విచారకరం.

ముస్లింల మానవహారం



పట్టణంలో మానవహారం నిర్వహిస్తున్న ముస్లింలు

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ మజిలిసుల్ ఉలేమా వల్ ఐమాలా ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మానవ హారం నిర్వహించారు. శ్రీనివాససెంటర్ నుంచి గాంధీచౌక్, ఆత్మకూరు బస్టాండ్, టెక్కె, సాయిబాబానగర్, నూనెపల్లె, సలీంనగర్, బస్టాండ్, బొగ్గులైన్, ఇతర ప్రాంతాల్లో మానవహారంగా ఏర్పడి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా శాంతియుతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మౌలానా అబ్దుల్‌రషాదీ, ఎస్ఎండీ అబులైజ్, అంజాద్‌బాషాలు మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ చట్టం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులను కాలరాస్తుందన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకునేంత వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామన్నారు. ముస్లింల మనోభావాలకు దెబ్బతినకుండా సుప్రీంకోర్టు ఈ చట్టాన్ని రద్దు చేస్తుందని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మస్తాన్, బాబాఫకృద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్ తమీమ్, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, ఎజాజ్, మజీద్‌ఖాన్, మౌలానా ఇద్రూస్, హిదాయతుల్లా, తదితర నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వీడాలి

నంద్యాల(అర్బన్): పాలకులు రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వీడాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన వార్షికోత్సవం సందర్భంగా సంగమేశ్వరం వద్ద ఈనెల 31న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం నంద్యాల రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక విక్టోరియా రీడింగ్ రూంలో రైతుల సంఘీభావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో నిర్మించిన ప్రాజెక్టులు ఒక్కొక్కటి నిర్వీర్యమవుతున్నాయన్నారు. శ్రీశైలం డ్యామ్ ప్లంజ్ పూల్ దెబ్బతినడం, అలగనూరు రిజర్వాయర్ కుంగిపోవడం, అన్నమయ్య ప్రాజెక్టు వరదలకు కొట్టుకుపోవడం, గోరుకల్లు రిజర్వాయర్ కట్ట దెబ్బతినడం, తుంగభద్ర డ్యాంకు భద్రత లేకపోవడం, గాలేరినగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టులు ఇంకా కొనసాగుతున్నా పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. సంగమేశ్వరంలో నిర్వహించే బహిరంగ సభలో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల ని కోరారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను రైతు సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు యూనస్, కార్యదర్శి నాగకుమార్, కొమ్మ శ్రీహరి, దండె సుధాకర్, నాగన్న, కరీం బాషా, మహబూబ్‌బాషా, శ్రీరాములు, అసదుల్లా, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రైతుకు లంచాల 'షాక్'

- ముడుపులు ఇస్తేనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
- ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకూ మామూళ్లు ఇవ్వాల్సిందే
- ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విద్యుత్ శాఖ అధికారి

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరిన రైతుల నుంచి కొందరు విద్యుత్ శాఖ అధికారులు మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు. ఇటీవల నంద్యాల జిల్లాలో ఒక రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు రూ.30 వేలు లంచం డిమాండ్ చేసి అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కోసం రైతులు మీసేవ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ముమ్మరంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 11,500 మంది వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ముందుగా విద్యుత్ అధికారులు వెళ్లి బోరు పాయింట్ నుంచి విద్యుత్ పోల్ ఉన్న ప్రాంతం వరకు ఎన్ని పోల్స్ పడుతాయో తెలుసుకోవాలి. అలాగే ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్ని పడుతాయో అంచనా వేయాలి. ఇందుకోసం రైతులు వేలాది రూపాయల ముడుపులు సమర్పించుకోవాల్సి వస్తోంది. అలాగే ఎస్టిమేట్లు వేయడానికి విద్యుత్ అధికారులు వెళ్లడానికి రైతులు ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేయాల్సి దుస్థితి నెలకొంది. ఎస్టిమేట్లు తయారు చేసిన తర్వాత డిమాండ్ నోటీసు ఇస్తే దాని ప్రకారం రైతు వాటా మొత్తాన్ని డీడీ చెల్లించాల్సి ఉంది. అయితే మండలస్థాయిలోనే మంజూరు అయితే ఒక రేటు, సబ్ డివిజన్ స్థాయిలో మంజూరు అయితే ఇంకో రేటు, డివిజన్ స్థాయిలో మంజూరు అయితే మరో రేటు ఉంటుంది. వెరసి ముడుపుల భారం రైతులపై గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు ఉంటుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

మెటీరియల్ ఇవ్వాలన్నా ముడుపులే!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా స్పందించరు. ''మీకు ఇంకా మెటీరియల్ రాలేదు.. రావడానికి మరో నెల రోజులు ఆలస్యం కావచ్చు.. కాకపోతే ఖర్చు అవుతుంది'' అని బేరం పెట్టడం గమనార్హం. నిబంధనల ప్రకారం మెటీరియల్‌ను డిపార్టుమెంటు వాహనాల్లోనే తరలించాల్సి ఉంది. అయితే వాహనాలు రిపేరీలో ఉన్నాయని, డ్రైవర్ లేదని రవాణా భారాన్ని రైతులపైనే వేస్తున్నారు. అధికారులు మాత్రం డిపార్టుమెంటు వాహనాలతో ట్రాన్స్‌పోర్టు చేశామని రికార్డు చేసుకొని డీజిల్ కాజేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చుక్కలు చూడాల్సిందే!

ఎస్టిమేట్లు వేయించుకోవడం ఒక ఎత్తు అయితే లైన్ వేయించుకోవడం మరో ఎత్తుగా మారింది. డిమాండ్ నోటీసుకు అనుగుణంగా రైతులు తమ వాటా మొత్తాన్ని చెల్లించిన తర్వాత పోల్స్ సరఫరా చేస్తారు. పోల్స్ ఇవ్వాలంటే ముడుపులు ఇచ్చుకోవాల్సిందే. పోల్స్ సంఖ్యను బట్టి ముడుపుల రేటు పెట్టినట్లు సమాచారం. పోల్స్ వచ్చిన తర్వాత ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్, కండక్టర్ విద్యుత్ శాఖ స్టోర్ నుంచి డ్రా చేస్తారు. అయితే రైతుకు ఇవ్వరు. మళ్లీ ముడుపులు ముడితేనే పోల్స్ పాతి, లైన్ వేస్తారు. విద్యుత్ లైన్ నుంచి బోరు పాయింటు దగ్గరకు లైన్ వేయడానికి 180 మీటర్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. 11 కేవీ లైన్ వేస్తే 180 మీటర్లకు దాదాపు రూ.60 వేలు, ఎల్‌టీ(లోటెన్షన్) లైన్ వేస్తే రూ.45 వేలు వరకు ఖర్చు వస్తుంది. అవసరాన్ని బట్టి 11 కేవీ లేదా ఎల్‌టీ లైన్ వేస్తారు. 180 మీటర్లు దాటితే ఆ ఖర్చు రైతు భరించాల్సి ఉంది. లైన్ దూరాన్ని, ఎస్టిమేట్ మొత్తాన్ని బట్టి ముడుపుల రేటు ఉంటుంది. లైన్ వేయాలంటే కనీసం రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే.

పెద్దాసుపత్రిలో ఆడ శిశువును వదిలేసి..

- అదృశ్యమైన తల్లి
- ఐసీడీఎస్ సంరక్షణలో శిశువు

కర్నూలు: నాలుగు నెలల ఆడశిశువును కన్న తల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో వదిలేసి వెళ్లింది. ఈ ఘటన కలకలం రేపింది. ప్రభుత్వ ఆస్పత్రిలోని పీఐసీయూ వార్డులో నాలుగు నెలల ఆడ శిశువును మంచం మీద పడుకోబెట్టి వదిలేసి పోతుండగా అక్కడున్న కొద్ది మంది గుర్తించారు. శిశువు గురించి ఆరా తీయగా తన పాపకు ఆరోగ్యం బాగాలేనందు వల్ల ఆస్పత్రికి వచ్చానని తల్లి బయటకు వెళ్లింది. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది మూడో పట్టణ పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. అలాగే 1098కు కూడా సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి సీఐ రామయ్య నాయుడు ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడి శిశువును వారికి అప్పగించారు. ప్రస్తుతం ఐసీడీఎస్ వారి సంరక్షణలో శిశువు ఉంది. ఎవరు వదిలేశారనే ఘటనపై పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా అక్కడున్న సీసీ కెమెరాల పుటేజీని సేకరించి శిశువు తల్లిని గుర్తించే పనిలో ఉన్నారు.



నీటి పరవళ్ల మధ్య చేపల వేట



కొంగత్త అందాలు!

నీరు పారితే మనసు పరవళ్లు తొక్కుతుంది. ప్రవాహం నురగలు కక్కుతుంటే.. ప్రకృతి పురివిప్పి ఆడితే.. ఆ దృశ్యాలను చూసేందుకు రెండు కళ్లూ చాలవు. సుంకేసుల డ్యాం నుంచి నీటి విడుదలను చూస్తే అలాంటి సంబరమే కలుగుతుంది. దిగువకు పారుతున్న నీటిలో వందలాది కొంగలు చేపలను వేటాడుతున్న తీరు 'కొంగ'త్త అందాలను ఆవిష్కరిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



సుంకేసుల డ్యాం నుంచి నీటి విడుదల

క్లుప్తంగా

గిరిజన ఉత్పత్తులను విస్తరింపజేయండి



చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నేతలు

కర్నూలు(అర్బన్): గిరిజనులు తయారు చేసిన ఉత్పత్తులను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తరింపజేసేలా చర్యలు చేపట్టాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఆదివారం ఇక్కడకు వచ్చిన గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌ స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకల రాజు, బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణనాయక్ తదితరులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు తయారు చేస్తున్న అరకు కాఫీ ఉత్పత్తులను అన్ని జిల్లాల్లోని మార్కెట్లు, రైతు బజార్లలో గిరిజన కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీల ద్వారా విక్రయించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో జీసీసీ రాష్ట్ర డైరెక్టర్ ఎస్ అరుణ్‌నాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం చైర్మన్ బద్దు నాయక్, ఫ్యాప్టో చైర్మన్ సేవాలాల్, రామునాయక్, ఎరుకల హరి, చంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణంలో చోరీ



మద్యం దుకాణం వెనుక భాగాన రేకు కట్ చేసిన సంఘటనను పరిశీలిస్తున్న సీఐ

బేతంచెర్ల: స్థానిక కొత్త బస్టాండు సమీపంలోని రమ్య మద్యం దుకాణంలో చోరీకి జరిగినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం వెనక భాగం నుంచి వచ్చిన దొంగలు రేకును కట్ చేసిలోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 3.99 లక్షలు అపహరించారు. శనివారం బ్యాంక్ సెలవు కావడంతో నిర్వాహకులు ఆ రోజు కలెక్షన్ డబ్బులు కౌంటర్‌లోనే ఉంచి వెళ్లడంతో రాత్రి చోరీకి గురైంది. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీం పోలీసులు మద్యం దుకాణాన్ని పరిశీలించారు. మద్యం దుకాణం నిర్వాహకుడు భూపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

నేడు కర్నూలులో ర్యాలీ

కర్నూలు(సెంట్రల్): రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారానే సరఫరా చేయాలని, ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని కోరుతూ సోమవారం ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే ర్యాలీలో ఎండీయూ ఆపరేటర్లతోపాటు కార్మికులు పాల్గొనాలని కోరారు.

కృష్ణయ్యకు మధుర నివేదన

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక సేవా గుణం కలిగి ఉండాలని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు సూచించారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో మామిడి పండ్ల ఉత్సవం, శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు తెచ్చిన మామిడి పండ్లతో జగన్నాథ్‌కు రాజ భోగ నివేదన చేశారు. అనంతరం ఆయన సందేశమిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణంతో సమస్యలకు పరిష్కార



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్గాలు దొరుకుతాయన్నారు. చిన్నారులకు చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలు, కుటుంబ విలువలు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు మామిడి పండ్లతో నివేదన

రీకౌంటింగ్‌లో ఉత్తమ మార్కులు

వెల్దుర్తి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష పేపర్ల రీకౌంటింగ్‌లో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. దేవనకొండ మండలం అల్లారుదిన్నె గ్రామానికి చెందిన బోయ మహేశ్వరి (హాల్ టికెట్ నంబర్ 2521115419) వెల్దుర్తి మండలం జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులలో చదివి పదో తరగతిలో 535 మార్కులు సాధించారు. హిందీలో 41 మార్కులు మాత్రమే రావడంతో రీకౌంటింగ్‌కు వెళ్లగా 99 మార్కులు వచ్చాయి. దీంతో ఆ బాలికకు గత ఫలితాలు 535కు అదనంగా 58 మార్కులు కలుపుకుని 593 మార్కులు వచ్చాయి. రీకౌంటింగ్‌లో బోయ మహేశ్వరి వచ్చిన మార్కులు డీఈఓకు చెబుతామని, అన్ని అవకాశాలు కల్పించాలని కోరుతామని వెల్దుర్తి జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులం ప్రిన్స్‌పాల్ షబానా బేగం తెలిపారు. కాగా.. 593తో బీసీ గురుకులాల్లోనే టాపర్‌గా నిలిచిన ఇతర జిల్లా అమ్మాయి, 592 మార్కులు సాధించిన వెల్దుర్తి జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులానికే చెందిన గంగసాని హాసిని అవార్డు పొందారు. ప్రస్తుత మార్కులతో బోయ మహేశ్వరి అవార్డు అందకోవాల్సింది. కాని అది జరగలేదు. తనకు ట్రిపుల్ ఐటీలో చదివే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని విద్యార్థిని బోయ మహేశ్వరి కోరారు.

గడివేములలో..

గడివేముల: మండల కేంద్రమైన గడివేములకు చెందిన శ్రీభారతికి తొలుత 577 మార్కులు వచ్చాయి. రీ కౌటింగ్‌కు అవకాశం ఇవ్వడంతో సైన్స్‌లో 10 మార్కులు పెరిగాయి. దీంతో 587 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఆ ముగ్గురు డిస్మిస్‌కు రంగం సిద్ధం!

- తిరుమల ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు
- దురలవాట్లు ఉన్న పోలీసుల గుండెల్లో రైళ్లు
- జాబితా సిద్ధం చేస్తున్న ఏపీఎస్‌పీ ఉన్నతాధికారులు
- సంఘటనపై ఐజీ రాజకుమారి ఆరా

కర్నూలు: పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో నిబంధనలు సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన పోలీసులే మద్యం మత్తులో హంగామా చేసిన సంఘటనను పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి ఆ ముగ్గురిని సర్వీస్ నుంచి తొలగించాలని (డిస్మిస్ ఫ్రమ్ సర్వీస్) ఆదేశించినట్లు కర్నూలు ఏపీఎస్‌పీ 2వ పటాలంలో చర్చ జరుగుతోంది. కర్నూలు 2వ పటాలానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఓంకార్ నాయక్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, సిరాజుద్దీన్‌ను క్రమశిక్షణ ఉల్లంఘన చర్యల కింద రెండు రోజుల క్రితం పటాలం కమాండెంట్ సస్పెండ్ చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో మద్యం సేవించడం నిషిద్ధం, నిషేధిత వస్తువులు కూడా తీసుకువెళ్లకుండా రెండు చోట్ల తనిఖీ కేంద్రాల్లో పరిశీలన జరుగుతుంది. ఆ పైనే తిరుమలకు అనుమతి ఉంటుంది. ఇంత పటిష్ట భద్రత ఉన్నా, తీవ్ర మద్యం మత్తులో ఆ ముగ్గురు తిరుమల వరకు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ వెళ్లడంతో రాష్ట్ర పోలీస్ బాస్ సీరియస్‌గా భావించి బెటాలియన్ ఐజీ రాజకుమారితో చర్చించి సర్వీస్ నుంచి వారిని తొలగించాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు పటాలం సిబ్బంది చర్చించుకుంటున్నారు. సంఘటన జరిగిన మరుసటి రోజే ఐజీ కర్నూలు పటాలం కమాండెంట్‌తో విచారణకు ఆదేశించినట్లు సమాచారం. మద్యం తాగి తిరుమలకు చేరుకున్న ముగ్గురిలో ఇద్దరిని తిరుమల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలం నుంచి ఒకరు పారిపోయారు. ఈ సంఘటనపై తిరుమల పోలీసులు కూడా పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నారు. ఆ ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు కూడా రంగం సిద్ధమైనట్లు సమాచారం. మూడు నెలల పాటు శ్రీవారి ఆలయం ముందు గార్డ్ డ్యూటీ నిర్వహించేందుకు ఆ ముగ్గురు కానిస్టేబుళ్లు తిరుమలకు వెళ్లారు. అయితే, మూడు రోజుల క్రితం ఇన్‌చార్జ్ ఆర్ఐకి సమాచారం లేకుండా పోలీసు వాహనంలో తిరుపతికి వెళ్లి మద్యం తాగి రావడాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ముస్లిం వ్యక్తి తిరుమలలో నమాజ్ చేసిన ఘటన జరిగిన మరుసటి రోజే కర్నూలు పోలీసులు మద్యం సేవించి హల్‌చల్ చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారులు సంఘటనను సీరియస్‌గా తీసుకొని విచారణకు ఆదేశించారు. వీరు ముగ్గురు 2013లో ఏపీఎస్‌పీ 2వ పటాలంలో కానిస్టేబుళ్లుగా విధుల్లో చేరారు. సిరాజుద్దీన్ గతంలో కూడా తెలంగాణ నుంచి మద్యం తీసుకొని పటాలంలోకి వెళ్తూ పోలీసులకు పట్టుబడి ఆరు మాసాల పాటు సస్పెండ్ అయ్యారు. ఈ నేపథ్యంలో మిగిలిన ఇద్దరిపై కూడా గతంలో ఏవైనా రిమార్కులు ఉన్నాయా, అనే కోణంలో ఆ శాఖ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



కంపెనీ ఇన్‌చార్జీలతో కమాండెంట్ టెలి కాన్ఫరెన్స్

ఏపీఎస్‌పీ పటాలంలో పనిచేస్తున్న సిబ్బంది రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహిస్తుంటారు. విజయవాడ కనక దుర్గమ్మ, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంతో పాటు ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే క్వార్టర్స్ బందోబస్తు విధులకు వెళ్తుంటారు. వీఐపీలకు భద్రత (గన్‌మెన్) విధులకు కూడా వెళ్తుంటారు. తిరుమల సంఘటన నేపథ్యంలో పటాలంలో పనిచేస్తున్న మొత్తం సిబ్బందిలో ఎంతమందికి మద్యం సేవించే అలవాటు ఉంది, విధుల పట్ల అలసత్వం వహిస్తున్న వారు, గతంలో క్రమశిక్షణ చర్యలకు గురైన వారు, తదితర విషయాలపై జాబితా సిద్ధం చేయాలని కమాండెంట్ కంపెనీ ఇన్‌చార్జీలకు టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు ఇచ్చినట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మద్యం అలవాటు ఉన్న పోలీస్ సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ సంఘటనపై గత మూడు రోజులుగా పటాలంలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఆత్మకూరులో పోలీస్ స్టేషన్‌పై గతంలో దాడి జరిగిన సంఘటనలో ఇదే పటాలానికి చెందిన ఓ కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్లు తేలడంతో అతడిని సర్వీస్ నుంచి తొలగించారు. ఇప్పుడు కూడా ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుమలలో మద్యం మత్తులో హంగామా చేసిన ఆ ముగ్గురిని కూడా సర్వీస్ నుంచి తొలగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు పటాలం సిబ్బందిలో చర్చ జోరుగా సాగుతోంది.

ఏపీటీఎస్‌ఏ రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ (ఏపీటీఎస్‌ఏ) రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నుంచి ముగ్గురు సబ్ ట్రెజరీ ఆఫీసర్స్ (ఎస్‌టీవో)లకు స్థానం లభించింది. ఆదివారం విజయవాడలో ఏపీఎస్‌టీఏ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీహెచ్ వెంగళ్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా ట్రెజరీలో ఎస్‌టీవోగా పని చేస్తున్న మురళీధర్ నాయుడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జిల్లా ట్రెజరీ ఎస్‌టీవో కరుణాకర్, డోన్ ఎస్‌టీవో రఘునందన్ కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గంలో స్థానాలు దక్కించుకున్న ఎస్‌టీవోలకు ట్రెజరీ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



ఎస్‌టీవోలను సన్మానిస్తున్న ట్రెజరీ ఉద్యోగులు

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

- ఆళ్లగడ్డ పట్టణ శివారులోని హైవేపై ఘటన
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ మృతి చెందాడు. రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శేఖర్ (30) అదనపు విధుల్లో భాగంగా శనివారం రాత్రి క్యూఆర్‌టీంతో కలిసి చాగలమర్రి టోల్‌ప్లాజా దగ్గర విధులు పూర్తి చేసుకుని ఆదివారం తెల్లవారుజామున కోవెలకుంట్లకు వెళ్లేందుకు హైవే పెట్రోలింగ్ వాహనంలో ఆళ్లగడ్డ హైవే డాబా దగ్గరకు వచ్చాడు. అక్కడి నుంచి ఆళ్లగడ్డకు వచ్చేందుకు అటుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను ఆపి ఎక్కి వస్తుండగా కొంచెం దూరం వచ్చేసరికి వెనుక వైపునుంచి వస్తున్న పాల లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగ గాయపడ్డ కానిస్టేబుల్ శేఖర్‌ను స్థానిక వైద్యశాలకు తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుడికి భార్య ప్రవళిక, నాలుగు సంవత్సరాల కొడుకు, ఏడాది వయసున్న కూతురు ఉన్నారు.



మృతి చెందిన శేఖర్

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

కానిస్టేబుల్ శేఖర్ అంత్యక్రియలు ఆదివారం చాగలమర్రి మండలం మద్దూరు గ్రామంలోని శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. డీఎస్పీ ప్రమోద్, సీఐ మురళీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఏఆర్, సివిల్ పోలీసులు గౌరవ వందనం చేశారు.

వలస బాటలో విప్లవ అడుగులు

కర్నూలు(సెంట్రల్)/ఆత్మకూరురూరల్: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా అంబూజ్ మాడ్‌లో ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల్లో ఆస్పరి మండలం ములుగుంద గ్రామానికి చెందిన మహిళ ఉంది. గ్రామానికి చెందిన మాదిగ దుబ్బన్న, ఎస్తేరమ్మ దంపతులకు ఐదుగురు సంతానం కాగా వారిలో పెద్ద కుమార్తె లలిత అలియాస్ సంగీత ఒకరు. కుటుంబ పోషణ కోసం 20 ఏళ్ల క్రితం హైదరాబాద్ వలస వెళ్లిన లలిత మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితురాలైంది. మొదట ఆమె బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే కుల నిర్మూలన పోరాట సమితిలో



కామ్రేడ్ లలిత అలియాస్ సంగీత(ఫైల్)

పనిచేసింది. ఆ తరువాత సంగీతగా పేరు మార్చుకొని మావోయిస్టు ఉద్యమంతో పరిచయమై పూర్తిస్థాయి పార్టీ కార్యకర్తగా ఛత్తీస్‌గఢ్ అడవుల్లోకి వెళ్లిపోయి పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసింది. ఈ క్రమంలో చీరాలకు చెందిన సజ్జా నాగేశ్వరావు సహచరిగా ఆమె మారినట్లు తెలుస్తోంది. సంగీత నర్సింగ్‌లో శిక్షణ పొంది పార్టీ కార్యకర్తలు, ఆదివాసీలకు వైద్య సేవలు అందించినట్లు సమాచారం. ఈమె మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు కార్యాలయ (మొబైల్) సిబ్బందిలో ఒకరుగా పని చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో పోలీసులు ఆరా తీయగా కర్నూలు జిల్లా ఆస్పరి మండలం ములుగుంద గ్రామానికి చెందిన మహిళగా శనివారం గుర్తించారు. 20 ఏళ్ల క్రితం వలస వెళ్లిన మహిళ చివరకు విగతజీవిగా తిరిగి వస్తుండటంతో గ్రామంలో కొందరు విషాదంలో మునిగారు.

నేడు అంత్యక్రియలు

మావోయిస్టు సంగీత అంత్యక్రియలను ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబకాష్ విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఎస్‌డీపీఐ నాయకులు జహంగీర్, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కరరెడ్డి, విరసం బాధ్యులు నాగేశ్వర ఆచారి పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు, వేద పండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి వేద మంత్రాలు పఠిస్తుండగా, మంగళవాయిద్యాల మధ్యన స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

టీడీపీ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు హనమంతుపై పోలీసుల స్టేషన్‌లో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు ఫిర్యాదు చేసినట్లు ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వర్‌గౌడ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. భూపనపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులో అక్రమంగా చేపలు అమ్ముకున్నారని, దీంతో గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

జాతీయ స్థాయి ఉషూ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉషూ సంఘం సభ్యులు

కర్నూలు (టౌన్): ఈనెల 26 నుంచి 31 వరకు తమిళనాడు రాష్ట్రంలోని ఈ–రోడ్డులో నిర్వహిస్తున్న 25 వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఉషూ పోటీలకు కర్నూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపికైన సాయిదామిని, సాయి తన్మయ్, షేక్ షాజిదా, యశిత రెడ్డి, ఉదయశ్రీ, రిషీ మహేందర్, సాధిక్, సాయి అరవింద్‌ను జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్ చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ అధ్యక్షులు ఐ.విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం 59వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ చైర్మన్‌గా టీజీ వెంకటేష్, ఆడిటర్‌గా బుచ్చన్న, కోశాధికారిగా కె.మురళీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరిగా ఎస్.నరేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వర్తకుల సమస్యలను సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఓంప్రకాష్, గురుస్వామి, టీవీ రత్నప్రసాద్, డి.వి.రమణ, జగదీష్, మారం అనిల్, జగన్నాథగుప్త, సుబ్రహ్మణ్యం, బదరినారాయణ పాల్గొన్నారు.

ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ షో



లక్కీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలోని ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రెడాయ్ ప్రాపర్టీ షో ఆదివారం సాయంత్రం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి క్రెడాయ్ నిర్వహిస్తున్న ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆస్తి కొనుగోలు చేయాలనుకోనే వారికి చక్కని వేదిక క్రెడాయ్ ఏర్పాటు చేసిందన్నారు. ఇలాంటి ప్రదర్శనలు కర్నూలు పరిసర ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శన పురస్కరించుకొని నిర్వహించిన లక్కీ డిప్ విజేతలకు బంగారు నాణం, ఇతర వస్తువులు అందజేశారు. క్రెడాయ్ సంస్థ అధ్యక్షులు సురేష్‌కుమార్ రెడ్డి, కన్వీనర్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. ప్రాపర్టీ ప్రదర్శనకు మంచి ఆదరణ లభించిందన్నారు. గణనీయమైన వ్యాపార లావాదేవీలు జరిగాయన్నారు. ప్రతి ఒక్కరి ఇంటి కలను క్రెడాయ్ కల్పించేందుకు ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ సంస్థ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎద్దుపెంట అంజి

కర్నూలు(అర్బన్): బీసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎద్దుపెంట అంజిని ఎన్నుకున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈపీ ధర్మగౌడ్ తెలిపారు. ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎద్దుపెంట అంజికి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ధర్మగౌడ్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘంలో బాధ్యతలు తీసుకున్న ప్రతి ఒక్కరు బీసీల హక్కుల కోసం కృషి చేయాలన్నారు. తరాలుగా బీసీలు అనేక రూపాల్లో అన్యాయాలకు గురవుతున్నారని, అన్ని రాజకీయ పార్టీలు వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన పాత్రను పోషించిన అంజిని బీసీ ఉద్యమాల వైపు తీసుకురావడం జరిగిందన్నారు. యువజన విభాగం జిల్లా నూతన అధ్యక్షుడు అంజి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తప్పక నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు సింగారం రంగా, సురేష్, దిలీప్, చంద్ర, శశి, కైలాస్, పులి పాల్గొన్నారు.




అంజికి నియామకపత్రం అందిస్తున్న ధర్మగౌడ్

పూర్వ విద్యార్థుల ఔదార్యం

పత్తికొండ రూరల్: తమ మిత్రుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడన్న విషయాన్ని తెలుసుకున్న పత్తికొండ జూనియర్ కళాశాల 1984–86 ఇంటర్మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్పందించారు. చేయిచేయి కలిపి లక్ష రూపాయలకు పైగా ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆదోని గర్ల్స్ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఎం.గోవిందరాజులు మెదడుకు సంబంధించిన వ్యాధితో హైదరాబాదులోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. సర్జరీకి రూ.15లక్షల వరకు అవుతుందని వైద్యులు పేర్కొన్నారు. అయితే వైద్యంకోసం అంత ఖర్చుపెట్టుకునేంత ఆర్థిక స్తోమత వారికి లేకపోవడంతో మిత్రులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. గోవిందరాజులు కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. మరికొంతమంది దాతలు చేయూతనందించి తమ స్నేహితుడి ప్రాణాన్ని కాపాడాలని వారు కోరుతున్నారు.

సంగమేశ్వరంలో భక్తుల సందడి

పచ్చదనం నడుమ సంగమేశ్వర ఆలయం






శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

పవిత్ర ప్రాచీన పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో కృష్ణా తీరం కళకళలాడింది. సరస్వతీ నది పుష్కరాల నేపథ్యంలో సంగమేశ్వరం సమీపంలో రెండు పుష్కర నదులైన కృష్ణవేణి, తుంగభద్ర మధ్య సరస్వతీ నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందనే నమ్మకంతో భక్తులు ఇక్కడి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చారు. అనంతరం వేపధారు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఓవైపు ఆకాశంలో నల్లని మబ్బులు.. మరో వైపు నల్లమల పచ్చదనం.. ఇంకోవైపు కృష్ణా జలాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

– కొత్తపల్లి



సంగమేశ్వర ఆలయం వద్ద కృష్ణానదీ తీరంలో భక్తుల సందడి